బి.పి మండల్ స్ఫూర్తితో చట్టసభల్లో
ఒబిసిల వాటా సాధిద్దాం


3లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 187, శనివారం 8-8-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ఓబిసి రిజర్వేషన్ల ప్రదాత
బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్


4వ పేజీల్లో

## ఆగస్టు 15న 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ

- సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- ప్రతి నెలా ఉచితంగా 6 కిలోల సన్నబియ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- రాష్ట్రమంతా ఏకకాలంలో ప్రారంభించాలని కలెక్టర్లకు ఆదేశాలు




హైదరాబాద్, ............ :

రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ద్వారా తెలంగాణలోని 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని మంత్రి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెల 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల్లోనూ అదే రోజు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. "స్వతంత్ర భారత దేశంలో అత్యంత సమర్థవంతమైన ఆహార భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన ఈ మహత్తర కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం ఆనందదాయకంగా ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జరిగే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ స్మార్ట్ రేషన్ కార్డులను పొందేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని స్పష్టం చేశారు.

## పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

- బే ఏరియా పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- అమెరికా పర్యటనలో ప్రవాస భారతీయులతో సమావేశం
- డిప్యూటీ సీఎం గౌరవార్థం భారత కాన్సుల్ జనరల్ విందు



శాన్ ఫ్రాన్సిస్కో, ............ 7:

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గౌరవార్థం శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె.శ్రీకర్ రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బే ఏరియాలోని ప్రముఖ ప్రవాస భారతీయులతోపాటు ఐటీ, వైద్య, మానవ వనరులు, ఇతర వ్యాపార రంగాలకు చెందిన విశిష్ట నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. ఐటీ ఆవిష్కరణల్లో హైదరాబాద్ అగ్రగామి. టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాలలో భారతదేశపు ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఎదుగుతోందని గుర్తు చేశారు. ఈ వృద్ధి వేగాన్ని ఇలా కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న సరికొత్త రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం కొత్త పునాదులు వేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పారదర్శకమైన, పెట్టుబడులకు అనుకూలమైన ప్రగతిశీల అభివృద్ధి నమూనాను అనుసరిస్తోందన్నారు. కొత్త ఆలోచనలను మిగతా 2లో..

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, కౌన్సిల్

- పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ
- అన్ని గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ కనెక్టివిటీ
- ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ ............

రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గవ్ కనెక్ట్(GOVconnect), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ(మీ-సేవ) సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలో శుక్రవారం నిర్వహించిన ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు. డిజిటల్ కేబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ వంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ మిగతా 2లో..

## బోఫోర్స్ కేసుకు సుప్రీం తెర

- 40 ఏళ్ల న్యాయ పోరాటానికి తెర
- హిందూజా సోదరులకు ఊరట..
- చివరి పిటిషన్ కొట్టివేత
- 2005 నాటి ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సవాలు తిరస్కరణ
- సీబీఐ పిటిషన్‌ను గతంలోనే తిరస్కరించిన సుప్రీం
- రూ.1,437 కోట్ల గన్‌ల ఒప్పందం చుట్టూ సాగిన వివాదం
- 1987లో వెలుగుచూసిన కమీషన్ల ఆరోపణలు
- 2018లోనే సీబీఐ అప్పీల్‌కు సుప్రీం నో
- తాజా తీర్పుతో బోఫోర్స్ కేసుకు పూర్తిస్థాయి ముగింపు

2

## జిల్లా నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

- ఎల్‌నినోపై రైతులకు ముందస్తు మార్గదర్శకాలు
- సాగర్, ఎస్ఆర్ఎస్‌పీలో నీటి నిల్వలు ఇంకా తక్కువే
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ స్మార్ట్ కార్డులు.
- ఆగస్టు 15న సీఎం చేతుల మీదుగా స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభం
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ............ :

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలనిరాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవ సాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయ మైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీలైన జిల్లాల్లో రేపటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ ఈ మండళ్లు మిగతా 2లో..

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్

- సెక్యూరిటీ బ్యూరో అధికారులను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్
- జాతీయ ప్రగతి సమీక్షలో 9 కీలక మూల్యాంకన ప్రమాణాల్లో అగ్రస్థానం

హైదరాబాద్, ............ :

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం, అత్యాధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తెలంగాణ పోలీసు శాఖ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ , సిపిలను, ఎస్పీలు తో పాటు సైబర్



సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఆధ్వర్యంలో గురువారం మిగతా 2లో..

## ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- అసెంబ్లీలో వైభవంగా బోనాల వేడుకలు
- పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా



హైదరాబాద్,ఆగస్టు 7:భద్రాద్రి న్యూస్:

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, సుఖశాంతులతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లు ఆకాంక్షించారు. శాసనసభ ఆవరణలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం బోనాల పండుగ శుక్రవారం ఘనంగా జరిగింది. తొలుత లెజిస్లేటివ్ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా స్పీకర్, మండలి చైర్మన్‌లు ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పూజల్లో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉద్యోగులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. లెజిస్లేటివ్ సెక్రటేరియట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ అభివృద్ధికి రూ.33.70 కోట్లు

- గ్రామీణ రహదారులు, వంతెనల అభివృద్ధికి భారీ నిధులు
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి పొన్నం కృతజ్ఞతలు

సిద్దిపేట ఆగస్టు 7:

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవ ర్గ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం మరో శు భవార్త అందించింది. గ్రామీణ రహదారు లు, వంతెనలు, క్రాస్ డ్రైనేజ్ పనుల అభివృద్ధికి రూ.33.70 కోట్లతో 28 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత శాఖ మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో మంజూరైన ఈ నిధులతో మిగతా 2లో..

## కేంద్రం ఇచ్చిన అనుమతులను సమీక్షించడం సరికాదు

- సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతివ్వాలి
- జీఆర్ఎంబీ 18వ సమావేశంలోని సమీక్ష అంశాలను తొలగించాలి
- ఇది కేంద్ర ప్రభుత్వ విశ్వసనీయతకు సంబంధించిన అంశం
- సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం జీఆర్ఎంబీకి లేదు
- జలశక్తి మంత్రికి, సెక్రటరీకి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, ............ :

కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను జీఆర్ఎంబీ సమీక్షించడం సరికాదని, అజెండాలో పేర్కొన్న అంశాలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని, జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖలో మాజీ మంత్రిహరీషర్‌రావు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని తన లేఖలో తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయమైన నీటి హక్కులను కాపాడేందుకు ఏపీ పునర్విభజన చట్టం 2014, సెక్షన్ 85 కింద తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) జరగబోయే 18వ సమావేశం ఎజెండాలో పొందుపరిచిన 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను తక్షణమే ఉపసంహరించుకునేలా ఆ బోర్డును ఆదేశించాలని లేఖలో హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం ఇప్పటికే మంజూరు చేసిన చట్టబద్ధమైన అనుమతులను మళ్లీ సమీక్షించేలా ఈ ఎజెండాను రూపొందించడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య మిగతా 2లో..

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ, ............ 7:

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో మిగతా 2లో..



# పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణే

మొదటిపేజీ తరువాయి..

సంస్థలుగా మార్చడంలో, నాణ్యమైన ఉపాధిని సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సభకు వివరించారు. మూసీ నది పునరుద్ధరణ, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తెలంగాణ యువతను భవిష్యత్ ఉద్యోగాలకు, ప్రపంచస్థాయి పోటీకి సన్నద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతోపాటు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

### దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి : కాన్సుల్ జనరల్

తొలుత సభికులకు స్వాగతం పలికిన కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. భారత్‌లో సమ్మిళిత ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతూనే ప్రవాసులకు సైతం ప్రయోజనం చేకూర్చేలా బలమైన భాగస్వామ్యాలను అన్వేషించాలని వ్యాపార వర్గాలను కోరారు. సమావేశం అనంతరం పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలు తదితర అంశాలపై ఎన్నారైలు, బే ఏరియా ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంతో అమెరికాలోని ప్రవాస భారతీయుల మధ్య బలమైన సంస్థాగత సంబంధాలు ఏర్పరచుకునే దిశగా ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరిగాయి. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐవోసీ నాయకులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, కౌన్సిల్

మొదటిపేజీ తరువాయి..

గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్దపీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్చేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..

హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే బస్సులు నగరం లోపలికి రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# హుస్నాబాద్ అభివృద్ధికి రూ.33.70 కోట్లు

మొదటిపేజీ తరువాయి..

సిద్ధిపేట, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు, వంతెనలు, లో-లెవల్ కాజ్‌వేలు, హై లెవల్ బ్రిడ్జిలు, స్లాబ్ కల్వర్టులు, రిటైనింగ్ వాల్స్, క్రాస్ డ్రైనేజ్ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

### - సిద్ధిపేట జిల్లాకు రూ.15 కోట్లు

సిద్ధిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో 15 పనులకు రూ.15 కోట్లు మంజూరు చేశారు. కోహెడ మండలంలో 10 అభివృద్ధి పనులకు రూ.7.20 కోట్లు, హుస్నాబాద్ మండలంలో 2 పనులకు రూ.3.50 కోట్లు, అక్కన్నపేట మండలంలో 3 పనులకు రూ.4.30 కోట్లు కేటాయించారు. మాలపల్లి-కుచనపల్లి బ్రిడ్జి, కాచాపూర్-పందిళ్ల బ్రిడ్జి, కొండమంజరుపల్లి-రేగొండ మధ్య హై లెవల్ బ్రిడ్జి, పందిళ్ల-నాకిరకొమ్ముల ఎక్స్ రోడ్ సీడీ వర్క్స్ వంటి కీలక పనులు ఇందులో ఉన్నాయి.

### - హనుమకొండ జిల్లాకు రూ.7.70 కోట్లు

హనుమకొండ జిల్లా పరిధిలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో 5 పనులకు రూ.7.70 కోట్లు కేటాయించారు. భీమదేవరపల్లి మండలంలో నాలుగు హై లెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేల నిర్మాణానికి రూ.6.20 కోట్లు, ఎల్కతుర్తి మండలంలో ఇందిరానగర్-గోపాల్‌పూర్ హై లెవల్ బ్రిడ్జికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు.

### - కరీంనగర్ జిల్లాకు రూ.11 కోట్లు

కరీంనగర్ జిల్లా పరిధిలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో 8 పనులకు రూ.11 కోట్లు మంజూరు చేశారు. స్లాబ్ కల్వర్టులు, రిటైనింగ్ వాల్స్, బ్రిడ్జిలు, క్రాస్ డ్రైనేజ్ పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా దుద్దెనపల్లి-మొగిలిపాలెం బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.50 కోట్లు కేటాయించడం విశేషం.

### - గ్రామీణ మౌలిక వసతులకు మరింత బలం

మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు మరింత సులభమవడంతో పాటు వ్యవసాయ, విద్య, వైద్య, వాణిజ్య అవసరాలకు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

## జిల్లా నీటిపారుదల సలహా
# మండళ్ల పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి..

కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండు మూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంత మేరకు సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదని పేర్కొంటూ, ఆయా కమాండ్ ఏరియాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.

అదే వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంవత్సరాల అనంతరం అర్హులైన కొత్త లబ్ధిదారులను ప్రజాపంపిణీ వ్యవస్థలో చేర్చి రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ క్రమంలో సుమారు 61 లక్షల మంది కొత్త లబ్ధిదారులను చేర్చి దాదాపు 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ సేవలు అందుతున్నాయని, ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం స్థానంలో ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

# సంక్షోభాలను అవకాశాలుగా మల్చుకోవాలి

- అప్పుడే పరిశ్రమలు మరింత బలోపేతం
- పాలిమర్ రంగానికి ప్రభుత్వం అండ
- సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వండి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 7: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలుచుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయని అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన హిప్లెక్స్-2026 ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని అన్నారు. ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని మంత్రి తెలిపారు. గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటికి పైగా మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే సుమారు రెండు లక్షల మంది జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉందని వివరించారు. పాలిమర్ రంగం అభివృద్ధి చెందితే తయారీ రంగం విస్తరిస్తుందని, దాంతో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, పాలిమర్ ధరల అస్థిరత, రవాణా, విద్యుత్ వ్యయాల పెరుగుదల, కార్మికుల కొరత వంటి అంశాలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధికి సమాంతరంగా అభివృద్ధి చెందే పాలిమర్ రంగం గత ఏడాది కేవలం 2.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసిందన్నారు. పీవీసీ పైపులు, హెచ్‌డీపీఈ పైపులు, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల్లో మందగమనం కనిపించినప్పటికీ పరిశ్రమల్లో విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. హిప్లెక్స్-2026కు లభించిన విశేష స్పందనే దేశ పారిశ్రామిక రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చరిత్ర చెబుతున్నదేమిటంటే... సంక్షోభ సమయాల్లోనే గొప్ప పరిశ్రమలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు. పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఏఐపీఎంఏ, టాప్మా, ఐపీఐ వంటి పరిశ్రమల సంఘాలు విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి విధానపరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బద్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఏఐపీఎంఏ ఉపాధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోఫోర్స్ కేసుకు సుప్రీం తెర

- 40 ఏళ్ల న్యాయ పోరాటానికి తెర
- హిందూజా సోదరులకు ఊరట..
- చివరి పిటిషన్ కొట్టివేత
- 2005 నాటి ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సవాలు తిరస్కరణ
- సీబీఐ పిటిషన్‌ను గతంలోనే తిరస్కరించిన సుప్రీం
- రూ.1,437 కోట్ల గన్‌ల ఒప్పందం చుట్టూ సాగిన వివాదం
- 1987లో వెలుగుచూసిన కమీషన్ల ఆరోపణలు
- 2018లోనే సీబీఐ అప్పీల్‌కు సుప్రీం నో
- సుప్రీంకోర్టు తాజా తీర్పుతో బోఫోర్స్ కేసుకు పూర్తిస్థాయి ముగింపు

న్యూఢిల్లీ, ఆగస్ట్7: దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది. అప్పీల్ దాఖలులో 4,522 రోజుల ఆలస్యం జరిగిందని పేర్కొంటూ దానిని స్వీకరించలేదు. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# నేడు పింఛనుదారుల మహాధర్నా

హైదరాబాద్,ఆగస్ట్7: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నేడు ఆగస్టు 7న మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు, హెల్త్ స్కీమ్ మెరుగుదల వంటి ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళన చేపడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను ప్రభుత్వం విస్మరించడం సరికాదనీ, తక్షణమే జోక్యం చేసుకుని డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరుతున్నారు. రాజధాని హైదరాబాద్‌తో పాటుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల దగ్గర ఈ నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. న్యాయమైన తమ హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పింఛనుదారుల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

## సైబర్ నేరాల నియంత్రణలో
# తెలంగాణ టాప్

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించిన జాతీయ ప్రగతి సమీక్షలో సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సైబర్ నేరాల పనితీరును 9 కీలక మూల్యాంకన ప్రమాణాల ఆధారంగా పరిశీలించగా, తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానం సాధించింది. సైబర్ నేరాల నియంత్రణ కోసం స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సీ) కింద ప్రత్యేక తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ను ఏర్పాటు చేసిన దేశంలో తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన సైబర్ మోసాల కేసుల్లో 49 ఈ-జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తుంది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో 88 శాతం, బాధితుల డబ్బు తిరిగి పొందే ప్రక్రియలో 81 శాతం పనితీరు నమోదు చేసింది. 'సహయోగ్' పోర్టల్ ద్వారా అభ్యంతరకర, నేరాలకు సంబంధించిన ఆన్‌లైన్ కంటెంట్ తొలగింపులో 88 శాతం పని తీరుతో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. అంతర్రాష్ట్ర సమన్వయంలో 97 శాతం సీఐఏఆర్ అభ్యర్థనలను పూర్తి చేయడంతో పాటు, 79 శాతం రాష్ట్రాల మధ్య అభ్యర్థనలను పరిష్కరించింది. అలాగే 5,500 మంది నేరస్థుల ప్రొఫైళ్లు అప్‌లోడ్ చేయగా, 15 వేల అంతర్రాష్ట్ర నేర లింకులను గుర్తించింది. మరో వైపు సైబర్ నేరాల కట్టడికి పోలీసు సిబ్బంది లో సామర్థ్య పెంపు కోసం 524 మంది అధికారులకు సైట్రెయిన్ పోర్టల్ ద్వారా శిక్షణా సదుపాయాలు కల్పించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 15 తీవ్రమైన సైబర్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం రాష్ట్ర సైబర్ నేరాల నియంత్రణ సామర్థ్యాన్ని ప్రతిబింబి స్తోంది. పోలీసులు ప్రజల్లో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 8.5 లక్షల మందికి పైగా చేరుకోగా, డిజిటల్ అరెస్ట్ మోసాలపై మరో 2 లక్షల మందికి ప్రత్యేక అవగాహన కల్పించింది. సైబర్ నేరాల నియంత్రణలో దేశస్థాయిలో తెలంగాణ మరోసారి ప్రథమ స్థానం సాధించడం రాష్ట్ర పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసు దేశానికే ఆదర్శంగా నిలవాలని, ఇదే స్థాయి పనితీరును కొనసాగిస్తూ తెలంగాణ పోలీసు గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# కేంద్రం ఇచ్చిన అనుమతులను సమీక్షించడం సరికాదు

మొదటిపేజీ తరువాయి..

ఉన్న జల వివాదం కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, అత్యున్నత సంస్థల అధికారాలు, వాటి విశ్వసనీయ తకు సంబంధించిన సున్నితమైన అంశమని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ టీఏసీ ఆమోదం తెలిపిందని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత, ఆ నిర్ణయాలను మళ్లీ సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం గోదావరి బోర్డు లాంటి కింది స్థాయి సంస్థకు ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను మళ్లీ సమీక్షించేందుకు జీఆర్ఎంబీకి అవకాశం ఇస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంత్ రెడ్డి, ముక్తేశ్వరం, చనాక-కొరట, మోడికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక ప్రాజెక్టులకు సుదీర్ఘ ప్రక్రియ తర్వాతే అనుమతులు వచ్చాయని, ఇప్పుడు వాటిని మళ్లీ సమీక్షించాలని ఎజెండాలో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ ఇప్పటికే ఈ ప్రాజెక్టుల అంశాలను లోతుగా పరిశీలించినందున, పరోక్ష పద్ధతుల ద్వారా వీటిని మళ్లీ తెరపైకి తీసుకురావడం సబబు కాదన్నారు. కేంద్ర మంత్రి తక్షణమే స్పందించి ఎజెండాలోని వివాదాస్పద అంశాలను తొలగించాలని, జలశక్తి శాఖ మరియు సీడబ్ల్యూసీ ఇచ్చిన అనుమతులను గోదావరి బోర్డు మళ్లీ సమీక్షించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

### మిషన్ భగీరథకు పదేళ్లు!

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. మిషన్ భగీరథ దేశానికే ఆదర్శంగా నిలిచిన పథకమని పేర్కొంటూ ఎక్స్ వేదికగా వీడియోను షేర్ చేశారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ సమస్యను రూపుమాపడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందన్నారు. కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. పదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ పథకం రాష్ట్ర ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుని, 'హర్ ఘర్ జల్' వంటి కార్యక్రమాలకు రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు అనేక గ్రామాలు, తండాలు, మారుమూల ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితి దయనీయంగా ఉండేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. మహిళలు బిందెలతో కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకునేవారని, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండేదన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యానికి గురయ్యేవారని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు గోదావరి, కృష్ణా నదుల నుంచి నీటిని సేకరించి శుద్ధి చేసి భారీ పైప్‌లైన్ల ద్వారా గ్రామాలు, పట్టణాలు, మారుమూల ప్రాంతాలకు తరలించే సమగ్ర తాగునీటి వ్యవస్థను నిర్మించారని చెప్పారు. మిషన్ భగీరథ నిర్మాణం ఎంత ముఖ్యమో, దాని నిర్వహణ కూడా అంతే ముఖ్యమని హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల సమస్యలు,



పంపింగ్ వ్యవస్థలో ఇబ్బందులు, విద్యుత్ అంతరాయాలు, మరమ్మతుల జాప్యం కారణంగా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన పథకాన్ని నిర్వహించే సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాజకీయ కక్షలకు ప్రజలకు ఉపయోగపడే పథకాలను బలి చేయొద్దని సూచించారు. మిషన్ భగీరథ నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించి, దెబ్బతిన్న పైప్‌లైన్లు, మోటార్లు, పంపింగ్ వ్యవస్థలను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.

# బి.పి మండల్ స్ఫూర్తితో చట్టసభల్లో ఒబిసిల వాటా సాధిద్దాం




- ఆధిపత్య దోపిడి కుల రాజకీయ పార్టీలను చిత్తుగా ఓడించాలి
- బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగిన నాడే విముక్తి
- ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- హనుమకొండలో మండల్ డే

**వరంగల్, ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్ ):** దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి) ల సుదీర్ఘ పోరాటం వల్ల నియమించబడిన మండల్ కమీషన్ నివేదికలోని ఒక అంశమైన విద్య, ఉద్యోగాల్లో ఒబిసి లకు రిజర్వేషన్లు కల్పిస్తామని పార్లమెంటులో ఆనాటి ప్రధాని వి.పి సింగ్ ప్రకటించిన రోజును (ఆగస్టు 7) ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం ఒబిసి ప్రజలు బి.సి ల స్వాభిమాన దినోత్సవంగా, మండల్ డే జరుపుకుంటారు. ఆ సందర్భంగా ఆల్ ఇండియా ఒబిసి జాక్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ వద్ద బి.పి మండల్ చిత్రపటానికి దండ వేసి నివాళులు అర్పించి వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. సాయిని నరేందర్ మాట్లాడుతూ 1980 లో సమర్పించిన బి.పి మండల్ కమీషన్ నివేదికను పదేళ్ల తర్వాత 1990 ఆగష్టు 7 న ఆనాటి ప్రధాని వి.పి సింగ్ అమలు చేయడానికి పార్లమెంటులో ప్రకటించగానే దేశంలోని రాజకీయ పార్టీలన్నీ గగ్గోలు పెట్టాయని. పీడిత ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీలు సైతం మండల్ కు వ్యతిరేకంగా, ఒబిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటం చేసినాయని, మీడియా మొత్తం మండల్ వ్యతిరేక ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చినారని అన్నారు. జనతాదళ్ ప్రభుత్వానికి బయట నుండి మద్దతు ఇస్తున్న బిజెపి తన మద్దతును ఉపసంహరించుకుని జనతాదల్ ప్రభుత్వాన్ని కూలదోసిందని, తన ప్రభుత్వం కూలిపోతుందని తెలిసి కూడా అనాటి జనతాదళ్ పార్టీ, ప్రధాని వి.పి సింగ్ ఒబిసి రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. అలాంటి ప్రత్యేక దినాన్ని ఉత్సవంగా జరుపుకోవడమే కాకుండా మండల్ డే స్ఫూర్తితో బి.సి హక్కుల సాధనకు బహుజన సమాజం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని అన్నారు. బి.సి రిజర్వేషన్ల విషయంలో, జనగణన విషయంలో బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీలు మోసం చేశాయని, ఉత్పత్తి శక్తిగా ఉన్న ఒబిసి సమాజం రాజకీయ శక్తిగా ఎదిగిన రోజునే రాజ్యాధికారం, సామాజిక న్యాయం, చట్టసభల్లో వాటా సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.సి ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కొంగ వీరస్వామి మాట్లాడుతూ బి.సి సమాజం నుండి ఎదిగిన మేధావులు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారస్థులు బి.సి హక్కుల కోసం పోరాటంలో ముందుండాలని అన్నారు. ఐక్య ఉద్యమాలతో దేశ వ్యాప్త ఉద్యమం చేసిన నాడే మండల్, వి.పి సింగ్ లాంటి త్యాగధనుల ఆశయాలు సాధన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ బహుజనుల విముక్తి కోసం దేశంలో జరిగిన పోరాటాలను అధ్యయనం చేయాలని, మహాత్మ జ్యోతిరావు పూలే మొదలు కాన్షీరామ్ వరకు మహనీయుల పోరాట మెలుకువులను తెలుసుకోవాలని, ప్రతి ఒక్క బి.సి నాయకుడు మండల్ నివేదికను అధ్యయనం చేసి వి.పి సింగ్ లాగా ధైర్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు ఆయుధాన్ని అమ్ముకున్నంత కాలం బి.సి సమాజం బానిసలుగానే బతకాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, డిబిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జన్ను పద్మ, వివిధ సంఘాల నాయకులు తుమ్మ తిరుపతి, అంకేశ్వరపు రాంచందర్, సద్గుణ, సూరం నిరంజన్, స్వరూప, జల్లెల కృష్ణమూర్తి, మీరాస్వామి యాదవ్, సురేఖ, బైరి దీప, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాగా స్కూల్‌లో ఆషాఢ మాసం గోరింటాకు పండుగ వేడుకలు








**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్ ):** విద్యార్థుల్లో మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీ రాగా ప్లే ఔ హై స్కూల్‌లో ఆషాఢ మాసం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవితా అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజచేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. గోరింటాకు ప్రాముఖ్యత, ఆషాఢ మాసంలో పాటించే సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. చిన్నారులు గోరింటాకు పెట్టించుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులకు సంస్కృతి, విలువలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే శ్రీ రాగా స్కూల్ లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత , ఉపాధ్యాయులు, దీప్తి, అశ్విని ,వెంకట లక్ష్మి, హసీనా,నాగమణి, చరిత శ్రీ,అఖిల,మహాలక్ష్మి,పూజిత,రేణుకా , రజినీ , రాంబాబు , రామ కృష్ణా మొదలగువారు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం




**హైదరాబాద్, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** మల్కాజ్గిరి మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుండె జబ్బు పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా ఆరోగ్య సేవలు అందించాలని హైదరాబాద్ కేంద్రంగా ఆనాటి స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంతో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ పథకానికి దారి తీసింది అన్నారు. నాయకులు రామచంద్రన్ మాదిగ మాట్లాడుతూ ....స్వయానా ఆనాటి స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి అసెంబ్లీలోనే ఆరోగ్య శ్రీ పథకానికి ప్రధాన కారణం మందకృష్ణ మాదిగ అన్న ని స్వయానా ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రణయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన ఒక వీరోచితమైన పోరాట ఫలితమే నేడు భారతదేశము అంతటా కూడా ఆయుష్మాన్ భారత్ పేరుతో ఆరోగ్యశ్రీ పథకం లాంటి వైద్యం పేదలందరికీ దేశమంతటా అందుతుందన్నారు. ఆనాడు చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించాలని ఆలోచనతోటి మందకృష్ణ మాదిగ అన్న చేసిన పోరాట ఫలితంగానే నేడు ఆరోగ్యశ్రీ పథకం రూపుదాల్చిందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భవిష్యత్తులో కూడా ప్రతి పేదవాడికి ఈ భారత దేశంలో కార్పోరేట్ వైద్య తరహాలో ఉచిత వైద్యం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న గారి ఆధ్వర్యంలో ఇక ముందు కూడా ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు కార్యక్రమం లో....జిల్లా ఇంచార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, జాతీయ నాయకులు కేశపాగా రాంచంధర్ మాదిగ, రాష్ట్ర నాయకులు బచ్చల కూర స్వామి మాదిగ, అంజి మాదిగ, మనోహర్ ,జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, జిల్లా నాయకులు బత్తిని శివ మాదిగ, వి హెచ్ పీఎస్ నాయకులు వినయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఆషాడ బోనాల మహోత్సవం




**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** శ్రీ చైతన్య పాఠశాల లక్ష్మీదేవి పల్లి బ్రాంచ్‌లో బోనాల పండుగను అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ తెలుగు దుస్తుల్లో హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారి వేషధారణలు, పోతురాజు వేషధారణలు, సంప్రదాయ అలంకరణలు మరియు భక్తి గీతాలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. పాఠశాల ప్రిన్సిపాల్ బోనాల పండుగ యొక్క విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. మన సంస్కృతి, ఆచారాలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అలాగే విద్యార్థులు తమ సంప్రదాయాలను గౌరవిస్తూ మంచి విలువలతో ఎదగాలని ప్రోత్సహించారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూలు, పండ్లు, నైవేద్యాలను సమర్పించి బోనాల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు ఐక్యత యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించబడింది. కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకొని ఘన విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు డీన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ మరియు పి పి టీ ఇన్‌చార్జ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఈనెల 12న జరుగు.. చలో "విద్యుత్ సౌదా " ను విజయవంతం చేయండి

*TGPE జేఏసీ నాయకుల పిలుపు.*




**పాల్వంచ, ఆగస్టు7 (భద్రాద్రి న్యూస్):** జెన్కో యాజమాన్యం వైటిపిఎస్ ( యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్) లోని స్టేజ్ -1,స్టేజ్ -2 లోని కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదన ను నిరసిస్తూ ౹౼జు( తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 12న చలో 'విద్యుత్ సౌదా ' కార్యక్రమం ఉంటుందని ఆ జేఏసీ బీటీపీఎస్ రీజనల్ నాయకులు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైటిపిఎస్ లోని స్టేజ్ -1 స్టేజ్ -2 లోని కోల్ ప్లాంట్,యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదన నిరసిస్తూ గత 39 రోజులుగా ౹౼జు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన జరుగుతున్న విషయం తెలిసిందే.ఈ ఆందోళనలో భాగంగా బీటీపీయస్ లోని ప్రధాన గేటు ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ బీటీపీఎస్ రీజినల్ కన్వీనర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బి.రవి ప్రసాద్,నరేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గత కొంత కాలంగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం శోచనీయమని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగివచ్చి జేఏసీ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రవితేజ, కార్మిక సంఘం -1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం- 1104 నాయకులు వెంకట్రామ్, కార్మిక సంఘం -327 రీజినల్ అధ్యక్షులు జి.కృష్ణ ఏఐటీయూసీ నాయకులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్: బిటిపిఎస్ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు.

# ఆప్కారి శాఖ తీరుపై అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు

- బెల్ట్ షాపులపై కానరాని తనిఖీలు -- మద్యం సిండికేట్‌పై మౌనమేల?
- మామూళ్ల మత్తే కారణమా అని ప్రశ్నించిన అడ్వకేట్ బోడా వినయ్ కుమార్



**కారేపల్లి. ఆగస్టు 7(భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండలంలో ఆప్కారి శాఖ అధికారుల పనితీరుపై అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదని ఆయన విమర్శించారు.ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకు విరుద్ధంగా ప్రతి మద్యం బాటిల్‌పై రూ.15 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆయన అన్నారు.మండలంలో కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం విక్రయాలను నియంత్రిస్తున్నారని, అయినప్పటికీ ఆప్కారి శాఖ అధికారులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందని బోడా వినయ్ కుమార్ పేర్కొన్నారు. కొంతమంది ఆప్కారి శాఖ అధికారులకు మద్యం సిండికేట్ నిర్వాహకుల నుంచి ప్రతినెలా మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని, అందుకే బెల్ట్ షాపులు, అధిక ధరల విక్రయాలపై చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఎంఆర్పీకి మించి ధరలు వసూలు చేస్తున్న వారిపై, అలాగే అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే, ఈ ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు.

# అవయవ దానం మహాదానం..

- విద్యార్థుల్లో చైతన్యం నింపిన అవగాహన కార్యక్రమం




**పాల్వంచ, ఆగస్టు 7 ( భద్రాద్రి న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో తెలంగాణ స్టేట్ ఆర్గన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్, హైదరాబాద్ సహకారంతో భాగ్య క్లబ్ ఆధ్వర్యంలో "అవయవ దానం -- మహాదానం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథి శ్రీ జి. గురు ప్రకాష్ అవయవ, శరీర దానం యొక్క ప్రాముఖ్యత, చట్టపరమైన అంశాలు, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించి విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీ టి. హరిలాల్, భాగ్య క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎన్. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె. మాధవి మాట్లాడుతూ అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి, మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవయవ దానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సమాజంలో సానుకూల సందేశాన్ని వ్యాప్తి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# అంబరాన్నంటిన బోనాల సంబరాలు..

*శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా బోనాల పండుగ..*





**పాల్వంచ, ఆగస్టు7 (భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాణి మిరియాల అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు బోనం విశిష్టతను గురించి వివరించారు తెలంగాణలో బోనాల పండుగ కొన్ని సంవత్సరాల నుండి అంగరంగ వైభవంగా జరుగుతుందని అన్నారు. కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బోనం అనేది భక్తికి కృతజ్ఞతలకు గ్రామ దేవతల పై ఉండే అపారమైన విశ్వాసానికి ప్రతిగానే అన్నారు. పోచమ్మ మైసమ్మ ఎల్లమ్మ దేవతకు భక్తుతో ప్రేమతో సమర్పించే నైవేద్యం బోనమని విద్యార్థులకు వివరించారు. పాఠశాలలోనే విద్యార్థులు బోనాలు ఎత్తుకొని సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించారు వివిధ వేషధారణలో అందరినీ అలరించారు. బోనాల పాటకు అందరూ అలరించి డాన్సులు వేశారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్చార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, అధ్యాపకులు శిరీష, చందన, భవాని, భావన, శ్రావణి, పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కారేపల్లి పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి..
- మద్యం సేవించి వాహనాలు నడపొద్దు: ఎస్ఐ బి. గోపి



**కారేపల్లి, ఆగస్టు 7(భద్రాద్రి న్యూస్ రాములు ):** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో భాగంగా ఎస్ఐ బి. గోపి, బ్లూ కోర్ట్ ఓంకార్, హోంగార్డ్ మల్లేష్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని వారు హెచ్చరించారు. అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# పోలీస్ ఉద్యోగాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కోచింగ్ ప్రారంభం




**పాల్వంచ, ఆగస్టు 7( భద్రాద్రి న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), పాల్వంచలో పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థుల కోసం టి.జె.ఎల్.ఎస్.ఎస్. (శ్రీ తోకల జగన్నాధం--లక్ష్మమ్మ సేవా సమితి), పాల్వంచ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ ప్రారంభించారు. ముఖ్య అతిథి టి.జి.ఎస్.పి.ఎఫ్., కె.టి.పి.ఎస్. యూనిట్ డి.ఎస్.పీ. ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో శారీరక సాధనతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాల్లో పట్టు సాధిస్తే పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమవుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్, పోలీస్ నియామక పరీక్షల మోడల్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకల రామదాసు, డాక్టర్ టి. అరుణ కుమారి, కోటగిరి రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ తులసి విజయ్ ప్రసాద్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.75 వేల వైద్య సాయం

**- ఎంపీ ఎల్ఓసీ అందజేత.. కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు చొరవ**



**సింగరేణి, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన సూరపాక కృష్ణ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి రూ.75 వేల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేశారు. ఈ ఎల్ఓసీని కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో సూరపాక కృష్ణ చేతికి తీవ్ర గాయాలు కావడంతో అత్యవసర శస్త్రచికిత్స అవసరమైంది. కుటుంబం నిరుపేద కావడంతో చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మల్లెల నాగేశ్వరరావు విజ్ఞప్తికి స్పందించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌తో మాట్లాడి రూ.75 వేల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు. అనంతరం ఆ ఎల్ఓసీని మల్లెల నాగేశ్వరరావు స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, చికిత్సకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావుకు, తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేసిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ పేదల ఉపాధికి గండి

**- జైల్‌భరోను విజయవంతం చేయాలని**
**వృకాస జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు పిలుపు**



**కారేపల్లి, ఆగస్టు 7(భద్రాద్రి న్యూస్ రాములు):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు దూరమవుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. ఈ నెల 10న కార్మిక, కర్షక, రైతు, ఉద్యోగి, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతాంగానికి నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. కార్మికులకు రక్షణ కల్పిస్తున్న చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి వారి హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, పేదల ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కే. నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కేసగాని ఉపేందర్, మండల కార్యదర్శి ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జైల్ బరో కార్యక్రమానికి జయప్రదం చేయండి

**- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వినతిపత్రం అందించిన ఆశా వర్కర్లు**
**- సిఐటియు యూనియన్ జిల్లా నాయకురాలు పి.రమ్య**
**మండల కన్వీనర్ బాదావత్ శ్రీను నాయక్ కార్యకర్తలకు పిలుపు**



**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తూ సీఐటీయూ యూనియన్ మండల కన్వీనర్ బాధావత్ శీను నాయక్ ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కామేపల్లి మండలం ఏజెన్సీ పరిసర ప్రాంతమైన 24 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్నటువంటి ఆశా వర్కర్లు కామేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈనె10వ తేదీన జరగబోయే జైల్ బరో కార్యక్రమంలో మేము సైతం అంటూ అందరం కలిసిమెలిసి మా సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు.అందరూ భాగస్వామ్యం ఆఐ పాల్గొంటున్నామని ముందస్తు వారు వైద్య అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు పి రమ్య మండల సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కోర్ర నీల.రేఖ. ఏ విజయ. ఘమ్మి.రాంబాయి అనిత.విజయ. కమలమ్మ.పద్మ తదితరులు పాల్గొన్నారు

# పి ఆర్ సి సాధించేవరకు దశల వారి పోరాటం కొనసాగిస్తాం

**- ఉపాధ్యాయ సంఘాల నేత వెంకటేశ్వర్లు వెల్లడి**



**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** ఉపాధ్యాయులకు పిఆర్సి ప్రకటించే వరకు దశల వారి పోరాటాలు కొనసాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేత జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.భోజనం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్సి సాధన, పెండింగ్ డీఏ ల కొరకు జీవో 25 సవరణ,సిపిఎస్ రద్దు లాంటి డిమాండ్ల సాధన కోసం దశలవారి పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి రవికుమార్,వీరభద్రం వి ఎస్ రెడ్డి,టీ కైలాస రావు,ఎస్.కె రంజాన్,హెచ్ఎం పి జ్యోతి,భవాని, కవిత,అరుణ, జ్యోతి,రమ ప్రభ, విజయ కుమారి, ఉష తదితరులు పాల్గొన్నారు.

# ఓబిసి రిజర్వేషన్ల ప్రదాత బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్

**- బిపి మండల్ యాదవ్ కు నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్**

**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):** భారతదేశ చరిత్రలో ఓబీసీలకు ఆగస్టు 7వ తారీకు ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిందని, దానికి స్ఫూర్తి ప్రదాత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ అని,ఆ మహనీయుని వల్లనే ఓబీసీల తలరాతలు మారడం జరిగిందని,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అభివర్ణించారు. మండల్ రిజర్వేషన్ డే సందర్భంగా కామేపల్లి మండలం లోని పండితాపురం లో శుక్రవారం బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తారీకు ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని,దీనికి ప్రధాన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ యాదవ్ కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన మహా నాయకుడు అని,తన జీవితమంతా రాజకీయ అధికారం కోసం కాకుండా ఓ బి సి,ఎస్ సి ఎస్ టి వర్గాల కు సమాన అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిన మహాయోధుడని, ఆ పోరాటానికి ఫలితంగా 1990 ఆగస్టు 7వ తారీఖున నాటి ప్రధాని విపి సింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని,ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఎంపీగా,కేంద్ర మంత్రిగా పనిచేసినప్పటికీ నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడి రిజర్వేషన్లు సాధించారు. అంతకుముందు ఏ నాయకుడు చేయని విధంగా దేశమంతటా పర్యటించి బడుగు బలహీన వర్గాల స్థితిగతులను గమనించి దేశంలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఒక వ్యక్తి తన కోసం కాకుండా సమాజం కోసం బ్రతికారని, అలాంటి బీపీ మండల్ యాదవ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే



మహమ్మద్,కొమ్మి నేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య,మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు,బండి ఉపేందర్,ధరావత్ హరిచంద్ర,మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, డేరంగుల తిరపయ్య, రామారావు,తురక బిక్షం,చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మాదారంలో సేవా పర్యటన.. మానవత్వం చాటిన డాక్టర్ బాదావత్ రవి

**- దశదిన ఖర్మలకు హాజరు.. గురువును కలిసి ఆశీస్సులు.. పక్షవాత బాధితులకు వైద్య పరీక్షలు**

**సింగరేణి, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్ రాములు ):** మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి శుక్రవారం సింగరేణి మండలం మాదారం గ్రామంలో పర్యటించి మానవీయ విలువలు, గురుభక్తి, సేవాభావాన్ని చాటారు. ఒకవైపు మిత్రుడి కుటుంబాన్ని పరామర్శిస్తూనే మరోవైపు గురువును కలిసి ఆశీస్సులు పొందడం, అనంతరం పక్షవాత బాధితులకు వైద్య సేవలు అందించడం ద్వారా స్థానికుల ప్రశంసలు అందుకున్నారు. ముందుగా తన చిన్ననాటి మిత్రుడు వాంక్డోత్ రమేష్ తల్లి దశదిన ఖర్మ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ రవి, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాదారం మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్, గ్రామ పెద్దలు, బంధువులు, మిత్రబృందం, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.దశదిన ఖర్మ అనంతరం డాక్టర్ రవి తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన కేవీ విద్యానికేతన్ పాఠశాలను సందర్శించి, ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ కప్పెర రంగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ఆశీస్సులు పొందారు. గురువులు అందించిన విద్య, విలువలే తన సేవా దృక్పథానికి పునాదిగా నిలిచాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గురువుల పట్ల ఆయన చూపిన గౌరవం స్థానికులను ఆకట్టుకుంది.అనంతరం మిషన్ వాక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని పలువురు పక్షవాత బాధితులను వారి నివాసాల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫిజియోథెరపీ, పునరావాస చికిత్స, వ్యాయామాలపై సూచనలు అందించారు. అవసరమైన వైద్య సహాయాన్ని ఫౌండేషన్ ద్వారా



అందిస్తామని హామీ ఇచ్చారు.పక్షవాతంతో బాధపడుతున్న వారు నిరాశ చెందకుండా సరైన సమయంలో చికిత్స, క్రమం తప్పని వ్యాయామం, ఫిజియోథెరపీ ద్వారా కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని డాక్టర్ రవి తెలిపారు. డాక్టర్ బాదావత్ రవి చేపడుతున్న సేవా కార్యక్రమాలు పక్షవాత బాధితులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. సేవే పరమోన్నత ధర్మమనే లక్ష్యంతో ఆయన కొనసాగిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

# తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

**- నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలి: ఎమ్మెల్యే రాందాస్ నాయక్**
**- ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరికీ నిండుగా ఉండాలి : పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**



**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్ ) :** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రామదాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు కుటుంబ సమేతంగా తిరుపతి తిరుమల దేవస్థానాన్ని కాలినడకన చేరుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సతీమణి లలిత, కుమార్తెలు గాయత్రి, చందనలతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తన సతీమణి ఇందుమతి తో కలిసి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు సుభిక్షంగా జీవించాలని రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లా సహకారంతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే వైరా నియోజకవర్గ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం మరింత సేవ చేసే శక్తి అవకాశాన్ని ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నామని, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజల



ఆశీర్వాదాల, సహకారంతో వైరా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా పనిచేస్తా - డాక్టర్ కాపా చంద్రకళ

**- ఆరవ వార్డులో అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**



**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఆరవ వార్డులో శుక్రవారం సమస్యలను పరిశీలిస్తూ అడిగి తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ ఈ సందర్భంగ చంద్రకళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్థానిక వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి పనులు సరవేగంగా కొనసాగుతున్నాయి అని, ఆరవ వార్డులోని మున్సిపల్ నిధులతో చేపడుతున్న సుమారు రూ. ఒక కోటి వ్యయంతో నిర్మిస్తున్న సైడ్ డ్రైనేజీ పనులకు కొలతలు తీసుకున్నారు. 20 వార్డుల్లో కూడా 20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని, అందులో భాగంగా ప్రతి వార్డులో డ్రైనేజీ వ్యవస్థ రోడ్లకు ఎస్టిమేషన్ జరగబోతున్నాయని, వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, పారుపల్లి కృష్ణారావు, లగడపాటి ప్రభాకర్ రావు, తోటకూర శ్రీకాంత్, గౌరవరపు జగదీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# పాలడుగు గ్రామంలో రీ-సర్వే వరం...

**భూ రికార్డులకు శాశ్వత భరోసా**



**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్)** వైరా నియోజకవర్గ మండల పాలడుగు గ్రామపంచాయతీ ఆఫీస్ లో శుక్రవారం భూ -రికార్డులకు రీ - సర్వే వరం శాశ్వత శాశ్వత భరోసా కార్యక్రమం పాలడుగు గ్రామ సర్పంచి గద్దల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా మండల తాసిల్దార్ ఎం. సురేష్ బాబు ఆ సరే కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి నైజాం, బ్రిటిష్ పాలనుంచి నేటిదాకా కాలక్రమేనా మార్పు వస్తుంది. కావున సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది, చెందుతూ ఉంది కావున రైతులు ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని భూముల హద్దులను సాంఘిక పరిజ్ఞానంతో భూముల రీ -సర్వేను కచ్చితంగా ఎలాంటి అవకత అవక తవకలు లేకుండా రికార్డుల్లో పారదర్శకత తో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ముక్యంగరైతులు ఈ సదా అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలడుగు గ్రామ సర్పంచి గద్దర్ నరసింహారావు, గ్రామపంచాయతీ సెక్రెటరీ కిరణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది వార్డ్ మెంబర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

